క్లుప్తంగా

వైభవంగా వీరభద్రస్వామి సంబరం



బి.దొడ్డవరంలో వీరభద్రస్వామి సంబరంలో పాల్గొన్న భక్తులు

మామిడికుదురు: బి.దొడ్డవరంలోని బొలిశెట్టి వారిపాలెంలో ఆదివారం వీరభద్రస్వామి సంబరం వైభవంగా నిర్వహించారు. మేళ తాళాలు, సన్నాయి వాయిద్యాలు, భక్తుల కోలాహలం, బాణసంచా కాల్పులు, ప్రభ ఊరేగింపు నడుమ గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారిని మేలుకొలిపిన అనంతరం వైనతేయ గోదావరి నది వరకు ఊరేగింపుగా వెళ్లారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం జమ్మిచెట్టు వద్ద పూజలు చేశారు. ఈ సందర్భంగా భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. భక్తులు వీరభద్రస్వామి నిప్పుల గుండం తొక్కారు. బొలిశెట్టి పెద్ద వీరన్న కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నాలుగు తరాల నుంచి నిర్వహిస్తున్న వీరభద్రస్వామి సంబరం వైభవంగా నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్థానికంగా భారీగా విద్యుద్దీపాలంకరణ ఏర్పాటు చేశారు.

పెద్దింట్లమ్మ ఆలయం వద్ద భక్తుల రద్దీ



కేశవదాసుపాలెం శివారు మెండుపాలెంలో పెద్దింట్లమ్మ ఆలయం వద్ద భక్తులు

సఖినేటిపల్లి: మండల పరిధిలోని కేశవదాసు పాలెం శివారు మెండుపాలెంలో కొలువై ఉన్న పెద్దింట్లమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. ఉదయం నుంచి సుదూర ప్రాంతాల నుంచి వాహనాల్లో అమ్మవారి దర్శనానికి భక్తులు తరలివచ్చారు. ఆదివారం సెలవు రోజు కావడంతో కుటుంబ సభ్యులతో భక్తులు తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అంతర్వేది దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్ పర్యవేక్షణలో ఎస్సై కె.దుర్గా శ్రీనివాసరావు, అంతర్వేది ఆలయ, పోలీసు, రెవెన్యూ సిబ్బంది భక్తుల క్యూలైన్లు పర్యవేక్షించారు. క్యూలైన్లలోని భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆయా శాఖలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ట్రావెల్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

కొత్తపేట: స్థానిక బోడిపాలెం వంతెన వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్రావెల్ బస్సు ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందినట్టు ఎస్సై జీ సురేంద్ర తెలిపారు. స్థానిక సమితి రోడ్డు ప్రాంతానికి చెందిన కోనాల రాఘవులు (72) అనే వ్యక్తి తన బాగోగులు చూసేవాళ్లు లేక బోడిపాలెం వంతెన వద్ద గల ఆంజనేయస్వామి గుడి వద్ద ఉంటూ ఆ ప్రాంతంలోనే తిరుగుతుంటాడు. శనివారం రాత్రి ఆ గుడి ఎదురుగా పడుకున్న రాఘవులును అమలాపురం వైపు నుంచి రావులపాలెం వైపునకు వెళుతున్న ఓ ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఢీకొనడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సఖినేటిపల్లికి చెందిన మృతుని కుమార్తె ఉండవల్లి వెంకటరమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సురేంద్ర తెలిపారు.

ఆనందోత్సాహాలతో ఇమామ్ హసన్ జయంతి



నగరంలో మిలాద్‌లో పాల్గొన్న ముస్లింలు

మామిడికుదురు: ముస్లింల ఆరాధ్య దైవం, రెండవ ప్రవక్త హజరత్ ఇమామ్ హసన్ జయంత్యుత్సవాన్ని నగరం గ్రామంలో ఆదివారం ఆనందోత్సాహాలతో నిర్వహించారు. దీనిలో భాగంగా బడే బీబీ పంజాలో మిలాద్ నిర్వహించారు. పలువురు ఉర్దూ కవులు తమ కవిత్వాల ద్వారా హజరత్ ఇమామ్ హసన్ గొప్పతనాన్ని కొనియాడారు. ఇస్లాం మత చరిత్రలో ఇమామ్ హసన్ పాత్రను భక్తులకు వివరించారు. మత ప్రబోధకులు షబ్బర్ అలీ జైదీ మిలాద్ ఆలపించారు. ఏటా రంజాన్ మాసంలో 15వ తేదీని హజరత్ ఇమామ్ హసన్ జయంతిని ఘనంగా నిర్వహిస్తారు.

మాజీ సర్పంచ్ సత్యవతి మృతికి సంతాపం



మాజీ సర్పంచ్ నాగసత్యవతి (ఫైల్)

సఖినేటిపల్లి: మోరిపోడు మైనర్ పంచాయతీ ప్రథమ సర్పంచ్ యెనుముల వెంకట నాగసత్యవతి మృతికి ఆదివారం పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు. శనివారం ఆమె స్వగ్రామంలో మృతి చెందారు. మోరి మేజర్ పంచాయతీ నుంచి వేరు చేసి ఏర్పాటైన మోరిపోడు మైనర్ గ్రామ పంచాయతీకి 1996 నుంచి 2001 వరకూ సర్పంచ్‌గా ఆమె సేవలందించారు. గ్రామ పంచాయతీ కార్యాలయానికి 5 సెంట్లు భూమిని కొనుగోలు చేసి, భవన నిర్మాణం ఆమె హయాంలో చేపట్టారు.

ముందే ముదిరిన ఎండలు

- భగభగ మండుతున్న భానుడు
- 40 డిగ్రీలు దాటుతున్న పగటి ఉష్ణోగ్రతలు
- ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలు
- పెరుగుతున్న విద్యుత్ వినియోగం
- విద్యుత్ కోతలతో వృద్ధులు, చిన్నారుల అవస్థ



అయినవిల్లి ముక్తేశ్వరం సెంటర్‌లో ఎండ వేడి నుంచి రక్షణగా శిరస్సుపై తువ్వాలు కప్పుకుని వెళ్తున్న వాహనచోదకుడు



ఆదివారం మధ్యాహ్నం జనసంచారం లేక నిర్మానుష్యంగా ముక్తేశ్వరం రహదారి

అయినవిల్లి: చలికాలం ఇలా ముగిసిందో లేదో భానుడు భగభగ మండుతున్నాడు.కొన్ని రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు పెరగడంతో ఉక్కపోత ఆపై విద్యుత్ కోత కారణంగా ప్రజలు అల్లాడిపోతున్నారు. ఎండకాలం ప్రారంభంలోనే సూర్యుడు 40 డిగ్రీల ఉష్ణోగత మించి భగభగ మండుతున్నాడు. వారం రోజులుగా కనిష్ట, గరిష్ట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. గత నెలలో కనిష్ట ఉష్ణోగ్రత 25 డిగ్రీల లోపు, గరిష్ట ఉష్ణోగ్రతలు 30 నుంచి 35 డిగ్రీల వరకు నమోదు కాగా ప్రస్తుత కనిష్ట ఉష్ణోగ్రతలు 35 డిగ్రీల నుంచి 40 డిగ్రీలు దాటి ఉష్ణోగతలు నమోదవుతున్నాయి. భానుడి భగభగల నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఎండలతో ప్రధాన కూడళ్లు జన సంచారం లేక వెలవెలబోతున్నాయి. వేసవి తాపం నుంచి ఉపశమనం కోసం పుచ్చకాయలు, దోసకాయలు, జ్యూస్‌లు, కూల్‌డ్రింక్స్ తదితర శీతల పానీయాల దుకాణాలు వెలుస్తున్నాయి. ప్రజలు దాహార్తిని తీర్చుకునేందుకు వాటిని ఆశ్రయిస్తున్నారు.

కూలర్లు, ఏసీలు సిద్ధం

పెరుగుతున్న ఎండలకు ఇన్నాళ్లు మూలకు చేరిన కూలర్లు, ఏసీలను సిద్ధం చేసి వినియోగంలోకి తెస్తున్నారు. రబీ పంటల నీటి తడులకు రైతులు విద్యుత్ మోటార్లను వినియోగిస్తున్నారు. రానున్న రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరిగి విద్యుత్ వినియోగం అధికమయ్యే అవకాశముంది. గతేడాది మే నెలలో గరిష్ట ఉష్ణోగ్రతలు 46 డిగ్రీల వరకు చేరాయి. ఈ ఏడాది కూడా వేసవి ఉష్ణోగ్రతలు అధికంగా ఉండే అవకాశముంటుందని వాతావరణ శాఖాధికారులు ప్రకటించడంతో ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఎండలకు తోడు విద్యుత్ కోతలు కూడా పెరిగాయి. విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపడుతూ విద్యుత్ శాఖ అధికారులు తరచూ సరఫరా నిలిపివేయడంతో వేళాపాళా లేకుండా కరెంట్ కోత విధిస్తున్నారు. దీంతో ప్రధానంగా వృద్ధులు, చిన్నారులు ఉక్కపోతతో అల్లాడుతున్నారు.

ఎండలు మండుతున్నాయ్



ఈ ఏడాది అప్పుడే ఎండలు మండుతున్నాయి. ఈ సారి ఎండలు ఎక్కువగా ఉంటాయని విశ్లేషకులు చెబుతున్నారు. ఇటీవల విద్యుత్ కోతలు కూడా మొదలయ్యాయి. సూర్యుడి ప్రతాపానికి ప్రజలు అల్లాడుతున్నారు. నా వయస్సు వాళ్లు బయటకు వెళ్లేందుకు భయపడుతున్నాం. మధ్యాహ్నం ఇంటికే పరిమితమవుతున్నాం.

– కునపరాజు నాగరాజు, మాగం, అయినవిల్లి మండలం

ఎండలు ఈ సారి ఎక్కువే



ఎండలకు చిన్నారులు, వృద్ధులు అల్లాడిపోతున్నారు. నడియవస్కులు సైతం ఎండ అంటే అల్లాడుతున్నారు. శీతల పానీయాలు, పుచ్చకాయలు, పండ్ల రసాలు తీసుకుని కొంత ఉపశమనం పొందుతున్నారు. అధికమైన ఎండలకు సైతం మేమున్నామంటూ అధికారులు విద్యుత్ కోతలు అమలు చేస్తూ ప్రజలు భయాందోళనకు గురిచేస్తున్నారు.

– బొక్కా బాలాజీ, మామిడికుదురు మండలం

వైద్య విద్యార్థిని మన్వితకు ఘన సత్కారం



డాక్టర్ మన్వితను సత్కరిస్తున్న ఆర్య వైశ్య సంఘం ప్రముఖులు

మామిడికుదురు: వైద్య విద్యలో పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి పట్టా పొందిన పాశర్లపూడిలంకకు చెందిన డాక్టర్ పెదమల్లు మన్వితను ఆదివారం గ్రామంలో ఘనంగా సత్కరించారు. స్వగ్రామంలో పెదమల్లు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఈ సన్మాన కార్యక్రమం జరిగింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు కంచర్ల బాబి సమావేశంలో మాట్లాడుతూ మారుమూల గ్రామంలో పుట్టి, 13 ఏళ్లు ఎంతో కష్టపడి చదువుకుని ర్యాంకు సాధించి ఎంబీబీఎస్ చదివి అనంతరం పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆమె మరిన్ని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అభిలాషించారు. మన్వితతో పాటు ఆమె తల్లిదండ్రులు శ్రీనివాస్, దేవి దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా మహిళా అధ్యక్షురాలు యెండూరి సీత, కంచర్ల కృష్ణ మోహన్, పోశెట్టి సూరిబాబు, కాసు శ్రీను, లక్కింశెట్టి బాబులు, ఏడిద కవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఉమా కొప్పేశ్వర స్వామి క్షేత్రం అభివృద్ధికి కృషి



పలివెల ఉమా కొప్పేశ్వరస్వామిని దర్శించుకుంటున్న జాతీయ బీజేపీ నాయకుడు రఘురామ్

కొత్తపేట: పురాణ ప్రసిద్ధి చెందిన పలివెల ఉమా కొప్పేశ్వరస్వామి ఆలయం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని బీజేపీ జాతీయ నాయకుడు కేంద్ర, రాష్ట్ర బీజేపీ మాజీ సమన్వయకర్త పురిగళ్ల రఘురామ్ స్థానికులకు హామీ ఇచ్చారు. రఘురామ్ ఆదివారం పలివెల ఉమా కొప్పేశ్వరస్వామి క్షేత్రాన్ని సందర్శించి, స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఆలయ తూర్పు ముఖ ద్వారం వద్ద ఆధ్వర్యంలో పలువురు స్థానికులు, నాయకులు రఘురామ్‌కు ఘనస్వాగతం పలికారు. పూజల అనంతరం వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. అనంతరం పురావస్తు శాఖ పరిధిలోని ఈ ఆలయ ప్రాంగణంలో శిథిలావస్థలో ఉన్న ఉత్తర రాజగోపురం, ప్రతి సోమవారం అన్నప్రసాద కార్యక్రమానికి షెల్టర్ నిర్మాణం, కోనేరు అభివృద్ధి, పలివెల ధర్మసత్రం అభివృద్ధి, వివాహ వేదికల ఆధునీకరణ వంటి పలు అంశాలను పలువురు స్థానికులు రఘురామ్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే అతి పురాతన ప్రసిద్ధ పుణ్య క్షేత్రాల్లో ఈ పలివెల క్షేత్రం ఒకటని అన్నారు. ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా ఇక్కడ శివపార్వతులు, వినాయకుడు, కుమారస్వామితో కూడిన శివ కుటుంబం ఏకపీఠంపై ఉండటం ఈ క్షేత్రం ప్రత్యేకత అన్నారు. ప్రభుత్వాల దృష్టికి అభివృద్ధి ప్రతిపాదనలు తీసుకువెళ్లి నిధుల మంజూరుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, రాష్ట్ర బీజేపీ యువమోర్చా అధికార ప్రతినిధి పాలూరి జయప్రకాష్‌నారాయణ, ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు సంపతి కనకేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు భమిడిపాటి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి సేవా సమితి సేవలు ఆదర్శనీయం



కొత్తపేట సత్యసాయి నిలయంలో కాళ్ల నరాల పరీక్షలు చేస్తున్న వైద్యుడు

కొత్తపేట: జిల్లాలో సత్యసాయి సేవా సమితులు నిర్వహిస్తున్న వివిధ సేవా కార్యక్రమాలు, ఉచిత వైద్య సేవలు అభినందనీయం, ఆదర్శనీయమని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. స్థానిక సత్యసాయి సేవా నిలయంలో ఆదివారం భారతదేశపు అతిపెద్ద ఏషియన్ వాస్కులర్ హాస్పిటల్స్ సౌజన్యంతో ఉచిత వేరికోస్ వీన్స్ (ఉబ్బిన సిరలు) వైద్య శిబిరం నిర్వహించారు. సత్యసాయి సేవా సమితి కన్వీనర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ కంకటాల సత్యనారాయణ (కేఎస్ఎన్), సమితి సీనియర్ సభ్యుడు సుతాపల్లి లక్ష్మీనారాయణరావు ఆధ్వర్యంలో జిల్లా సత్యసాయి సేవాదళ్ కన్వీనర్ మన్యం పర్వత వర్ధనరావు పర్యవేక్షణలో నిర్వహించిన ఈ శిబిరాన్ని స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ డాక్టర్ దుర్గాప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. శిబిరాన్ని ఎమ్మెల్యే బండారు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా సమితి ద్వారా సభ్యులు చిత్తశుద్ధితో సేవా కార్యక్రమాలు చేస్తున్నారంటూ అభినందించారు. జిల్లా సేవాదళ్ కన్వీనర్ మన్యం పర్వతవర్ధనరావు మాట్లాడుతూ 'మానవసేవ – మాధవసేవ' అనే సత్యసాయి బాబా వారు అనుసరించి చూపిన మార్గం, స్వామి స్ఫూర్తితో సత్యసాయి సేవా సమితి సమాజసేవలో తరిస్తుందన్నారు. ముఖ్యంగా కొన్నేళ్లుగా దీనులకు, వృద్ధులకు, అనాథలకు ప్రతిరోజు అన్నదానం (ఇంటికే భోజనం క్యారేజీలు తీసుకువెళ్లి ఇవ్వడం) కార్యక్రమాన్ని కొనసాగించడం ఎంతో గొప్ప విషయమన్నారు. అనంతరం కాళ్లలో సుమారు 15 రకాల నరాల వ్యాధులతో బాధపడుతున్న వారికి ఏషియన్ హాస్పిటల్ వాస్కులర్ సర్జన్స్ డాక్టర్ సోమాచారి, డాక్టర్ ఎస్ సాయితేజ రూ. 5 వేలు విలువైన కన్సల్టేషన్, స్కానింగ్ తదితర పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో 282 మంది వైద్య సేవలు పొందారు. వారిలో 48 మందిని శస్త్రచికిత్సకు సిఫార్సు చేశారు. వారికి హైదరాబాద్ ఏషియన్ వాస్కులర్ హాస్పిటల్లో ఉచితంగా శస్త్రచికిత్స చేయనున్నట్టు కేఎస్ఎన్ తెలిపారు. శిబిరానికి వచ్చిన వారందరికీ మజ్జిగ, అల్పాహారం (పులిహోర, పెరుగన్నం) సమకూర్చారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ పీఆర్‌ఓ ఎస్‌కే రహీమ్, సేవా సమితి సభ్యులు సత్యవరపు భాస్కరరావు, చొప్పెర్ల రాంబాబు, కంకటాల సాయి, చింతం రామకృష్ణ, ఎస్ గోపాలరావు, కంకటాల తాయారు. ఎస్ అనంత, సరోజిని, మాధవి సేవలందించారు.

మానవతా విలువలపై యువతకు శిక్షణ



నేదునూరులో యువతకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న రావి ఫౌండేషన్ నిర్వాహకులు

అయినవిల్లి: నేదునూరులోని రావి ఫౌండేషన్, వివేకనందా కేంద్ర, కన్యాకుమారి బృందం అమలాపురం శాఖ సౌజన్యంతో సంస్కార వర్గ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆదివారం 8 నుంచి 20 ఏళ్ల వయస్సున్న బాల, బాలికలకు, యువతులకు వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేసేలా సంస్కార వర్గ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వివేకానంద రాక్ మెమోరియల్, కన్యాకుమారి నుంచి విచ్చేసిన శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ శిక్షణ తరగతులు నిర్వహించారు. వీరికి యోగా, సూర్యనమస్కారాలు, ఏకాగ్రత, ఆరోగ్యాన్ని పెంపొందించే ఆటలు దేశభక్తి గేయాలలో శిక్షణనిచ్చారు. తల్లిదండ్రులు, గురువులు, పెద్దల పట్ల యువత వ్యవహరించాల్సిన తీరుపై అవగాహన కల్పించారు. యువత సమాజంలో మానవతా విలువలతో ఏ విధంగా జీవించాలి అనే అంశాలపై శిక్షణనిచ్చారు. ఈ కార్యక్రమంలో వివేకానంద కేంద్ర ప్రతినిధులు మేజర్ పి.శారద, వెంపరాల సువర్ణ, మౌనిక, స్వర్ణ, అంగర శివసాయిగౌడ్, రావిఫౌండేషన్ సెక్రటరీ పాలగుమ్మి వెంకటకృష్ణ పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు చర్యలు



మామిడికుదురులో మల్టీ పర్పస్ భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్

మామిడికుదురు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి, డాక్టర్ భూపతి నాగేశ్వరరావు స్మారకార్థం రూ.30 లక్షలతో అతని కుటుంబ సభ్యులు నిర్మించనున్న మల్టీ పర్పస్ భవన నిర్మాణానికి రాజోలు ఎమ్మెల్యే దేవవరప్రసాద్ ఆదివారం శంకుస్థాపన చేశారు. పాఠశాల ప్రాంగణంలో ఈ భవనం నిర్మించనున్నారు. ఈ సందర్భంగా హెచ్ఎం సీహెచ్ నిరంజని అధ్యక్షతన నిర్వహించిన సభలో ఎమ్మెల్యే వరప్రసాద్ మాట్లాడుతూ మామిడికుదురులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానన్నారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న హెచ్ఎం నిరంజనిని ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. మామిడికుదురు స్కూల్‌ను పూర్వ విద్యార్థుల సహకారంతో చక్కగా తీర్చిదిద్దారని ఆమెను అభినందించారు. కార్యక్రమంలో రాజోలు ఎంపీపీ కేతా శ్రీనివాస్, ఎంపీటీసీ వర్ధనేని రాము, పార్టీ నేతలు యాలి శ్రీనివాస్, దిరిశాల బాలాజీ, యింటి మహేంద్ర, రుద్రా శ్రీను, అల్లు సురేష్, ఎంఈఓలు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఎడ్ల పరుగు ప్రదర్శనలో అవార్డుల పంట



ఎడ్ల పరుగు ప్రదర్శలో అవార్డును అందుకుంటున్న గుమ్మిలేరు పాడి రైతు

ఆలమూరు: గుమ్మిలేరు పశుపోషకుడు కోరా వీరభద్రరావుకు చెందిన ఎద్దులు రాష్ట్రస్థాయి ఎడ్ల పరుగు ప్రదర్శనలో అవార్డులు సాధించాయి. తూర్పు గోదావరి జిల్లా కాపవరంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎడ్ల పరుగు ప్రదర్శనలో వీరభద్రరావుకు చెందిన మూడు జతల ఎడ్లు పాల్గొని బహుమతులను కైవశం చేసుకున్నాయి. ఎడ్ల పరుగు పోటీలు సీనియర్స్ జూనియర్స్ విభాగాల్లో నిర్వహించారు. ఆ రెండు విభాగాల్లో ప్రథమ స్థానాలు సాధించాయి. మరో జత ఎడ్లు సీనియర్స్ విభాగంలో తృతీయ స్థానం బహుమతులు సాధించినట్లు పాడి రైతు వీరభద్రరావు తెలిపారు. రాష్ట్రస్థాయి ఎడ్ల పరుగు ప్రదర్శన పోటీల్లో మరోసారి గుమ్మిలేరుకు పేరు తెచ్చిన రైతు వీరభద్రరావును గ్రామస్తులు అభినందించారు. రైతు తరపున ఆయన కుటుంబసభ్యులు అవార్డులను స్వీకరించారు.

ఆదర్శనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దేవ, మాజీ మంత్రి గొల్లపల్లి తదితరులు

రాజోలు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదర్శనీయుడిగా నిలిచారని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. ఆదివారం శివకోడు గుమళ్లగరువు శుభోదయ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నూతన విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, మాజీ ఎమ్మెల్యేలు పాముల రాజేశ్వరిదేవి తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్ నక్కా రామారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే వరప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచ మేధావుల్లో అంబేడ్కర్ ఒకరుగా నిలవడం ఎంతో గర్వకారణమన్నారు. మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి రిజర్వేషన్లు సమకూర్చారని, అంబేడ్కర్ భావాలను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఎంపీపీ కేతా శ్రీనివాస్, సర్పంచ్ రేవు జ్యోతి, నాయకులు పీతల రామచంద్రరావు, తెన్నేటి కిషోర్, రావి విజయ్ పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

సఖినేటిపల్లి: పదవ తరగతి పరీక్షలు సోమవారం నుంచి ఈ నెల 31వ తేదీ వరకూ కొనసాగుతాయని దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఎంఈఓ 1 డి.కిషోర్‌కుమార్ తెలిపారు. ఆదివారం సఖినేటిపల్లిలోని ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ మండలంలో ఐదు సెంటర్లలో పరీక్షలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆయా సెంటర్లలో మొత్తం 700 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారని చెప్పారు. వీరిలో ప్రభుత్వ పాఠశాలల నుంచి 589 మంది, ప్రైవేటు పాఠశాలల నుంచి 111 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. రామేశ్వరం, అంతర్వేదిపాలెం, కేశవదాసుపాలెం, మోరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో, సఖినేటిపల్లి లూథరన్ ఉన్నత పాఠశాలలో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆయన పేర్కొన్నారు.

నేటి నుంచి పదో తరగతి పరీక్షలు

అయినవిల్లి: మండలంలోని 11 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల, 4 ప్రైవేటు పాఠశాల నుంచి 696 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరవుతారని ఎంఈఓ పి.శ్రీనివాస్ తెలిపారు. 351 మంది బాలురు, 345 మంది బాలికలు ఈ పరీక్షలు రాయనున్నట్టు ఆయన తెలిపారు. 17వ తేదీ నుంచి 31 వరకూ ఈ పరీక్షలు నిర్వహిస్తారని అన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం



మలికిపురంలోఎస్సై సురేష్‌కు విరాళం చెక్కు ఇస్తున్న ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు

మలికిపురం: మలికిపురంలో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం స్థానిక ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు ఆదివారం పోలీసు శాఖకు రూ.25 వేలు నగదు విరాళం అందించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్సై సురేష్‌కు ఈ విరాళానికి సంబంధించిన చెక్కును వారు అందజేశారు.

పొట్టి శ్రీరాములుకు భారతరత్న ప్రదానం చేయాలి



వాడపాలెంలో పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న పవన్‌సురేష్ తదితరులు



పి.గన్నవరంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కొత్తపేట: స్వాతంత్ర్యోద్యమంలో, ఆంధ్రోద్యమంలో పొట్టి శ్రీరాములు సేవలు, త్యాగాలకు గుర్తుగా భారత ప్రభుత్వం అత్యున్నత భారతరత్న పురస్కారాన్ని ప్రకటించి గౌరవించాలని మహాత్మా గాంధీ అధ్యయన సంస్థ వ్యవస్థాపకుడు దుళ్ల వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతిని వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల పరిధిలోని పలివెలలో జాతీయ నాయకుల విగ్రహాల నడుమ గల శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. శ్రీరాములు ఆశయాలపై ప్రచురించిన దేశభక్తివాణి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దుళ్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగం ఫలితమే భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు అని అన్నారు. ఆయనకు భారతరత్న కోసం సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టామని, ఇది ఏడాది పాటు కొనసాగుతుందన్నారు. హైస్కూల్ విద్యార్థులకు రన్నింగ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యుడు కంకటాల శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో..

స్థానిక ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. వాసవీ కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపం, సమితి రోడ్డు, పాత బస్టాండ్ సెంటర్లలో శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు శ్రీఘాకోళ్లపు బాబి, జిల్లా మెడికల్ కమిటీ చైర్మన్ డాక్టర్ పీ కష్టారావు, పొలిటికల్ వైస్ చైర్మన్ తమ్మన సాయిప్రసాద్, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఎండూరి పవన్‌కుమార్, సంఘం సభ్యులు శ్రీఘాకోళ్లపు రాధాకృష్ణ, తమ్మన రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వాడపాలెం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శ్రీఘాకోళ్లపు భీమేశ్వరరావు ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధర్మసూత్రం ఆధ్యాత్మిక వేదిక ఫౌండర్స్ చోడిశెట్టి పవన్‌సురేష్ (సినీ నటుడు), జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ సింగిరెడ్డి గోవిందస్వామి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. వారు శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అమరజీవికి ఘన నివాళి

పి.గన్నవరం: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలు అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని స్థానిక కొత్త అక్విడెక్టు పార్కులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పి.గన్నవరం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పాబోలు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో నాయకులు శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నల్లా పెదకాపు, తమ్మన ప్రసాద్, కట్టా గుప్తాజీ, శ్రీఘాకోళపు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వేద స్మరణతో మానసికోల్లాసం



ప్రవచిస్తున్న సుందర శ్రీనివాస్‌దాస్

అయినవిల్లి: సనాతన ధర్మాన్ని వేదం సారం ద్వారానే తెలుసుకోవచ్చని వేద స్మరణతో, పఠనంతో మానసికోల్లాసం అలవడుతుందని నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిర్ నిర్వాహకుడు సుందర శ్రీనివాస్‌దాస్ ప్రభూజీ అన్నారు. ఆదివారం నల్లచెరువులో అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిరంలో ఈ కృష్ణుడికి విశేష అభిషేకాలు, పూజలు చేశారు. ఈ సందర్భంగా సుందర శ్రీనివాస్‌దాస్ ప్రభూజీ మాట్లాడుతూ వేద శాస్త్రాల సూచనలను మానవులు ఆచరించాలన్నారు. భగవంతుడు ఒక్కరే ఉన్నారని ఆయన్నే సమస్త ప్రాణికోటి పూజించి ఆయన సేవలోనే తరించాలన్నారు. ఆయనే శ్రీకృష్ణ భగవానుడని అన్నారు. అనంతరం మందిరం వద్ద భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.